క్లుప్తంగా

85 మందికి నేత్ర పరీక్షలు



శస్త్ర చికిత్సల కోసం రోగులను విశాఖపట్నానికి తరలిస్తున్న సిబ్బంది

బూర్జ: మండలంలోని ఓవీపేట గ్రామంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సహకారంతో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 85 మంది డాక్టర్ వివేక్ కంటి పరీక్షలు చేశారు. వీరిలో శస్త్ర చికిత్సలకు 25 మందిని ఎంపిక చేశారు. ఉచితంగా ఆపరేషన్ చేసి మందులు అందజేయనున్నట్లు వైద్యుడు తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది, సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ గోపీబాల

నరసన్నపేట: మండలంలోని 34 పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లు సకాలంలో పూర్తిచేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి గోపీబాల అన్నారు. పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల పన్నుల వసూలులో వెనకబడి ఉన్న పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. 'స్వామిత్వ సర్వే'పై సమీక్ష నిర్వహించారు. మండలంలో దేవాది, జమ్ము, కంబకాయ, పారశెల్లి, కరగాం, సత్యవరం రూరల్‌తోపాటు పలు పంచాయతీల్లో స్వామిత్ర సర్వే జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి సచివాలయ సిబ్బంది బాధ్యతగా ఉండి సర్వే పూర్తి చేయాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

హిరమండలం: యువత మత్తు పదర్థాలకు దూరంగా ఉండాలని హిరమండలం ఎస్‌ఐ వెంకటేష్ సూచించారు. పాత హిరమండలంలో సంకల్పం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ముమ్మరంగా పైపులైన్ల పనులు



పైపులైన్ పనులు చేపడుతున్న దృశ్యం

కొత్తూరు: కొత్తూరులోని పాలకొండ–శ్రీకాకుళం రోడ్డులో నివాసం ఉంటున్న కుటుంబాలకు తాగు నీరును అందించేందుకు పంచాయతీ నిధులతో పైపులైన్ పనులు చేస్తున్నారు. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తామని సర్పంచ్ పడాల కృష్ణవేణి గురువారం తెలిపారు. రెండు రోజుల నుంచి పనులు చేస్తున్నామన్నారు. పంచాయతీలో అన్ని వీధులకు తాగునీరు అందిస్తామన్నారు.

స్థల పరిశీలన



పాడి రైతులతో మాట్లాడుతున్న డీడీ గణపతిరావు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం పశువైద్య కేంద్రం శిథిలావస్థలో ఉందని, దీని స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధకశాఖ డీడీ బి.గణపతిరావు అన్నారు. గురువారం ఆయన ఉర్లాం పశువైద్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సచివాలయం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. భవనం శిథిలమైందని పాడి రైతులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీడీ పరిశీలించారు. భవన నిర్మాణానికి ఐదు సెంట్లు స్థలం ఉండాలన్నారు. స్థలం నిర్ణయమైతే నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. నడగాం పశువైద్యాధికారి ఓంకార్, తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

కొత్తూరు: మండలంలోని మాసింగికి చెందిన బొందల వెంకటేష్ తన లారీని కొత్తూరు డిగ్రీ కళాశాల ఎదురుగా పార్కు చేశారు. పార్కు చేసిన లారీలో టైరు, రెండు బ్యాటరీలు, 200 లీటర్ల డీజిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించారు. లారీ ఓనర్ వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ అమీర్ ఆలీ గురువారం తెలిపారు.

నరకయాతన



మెటల్ తేలడంతో ప్రమాదకరంగా మారిన సరాలి రోడ్డు

- రెండు బీటీ రహదారులకు రూ.4.70 కోట్లు మంజూరు
- ఐదు నెలలు దాటినా పనులు పూర్తికాని వైనం
- రాళ్లు తేలి.. గోతులు పడి
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

పాతపట్నం: పల్లె పండగ పేరుతో రహదారులన్నీ బాగుచేశామని కూటమి నాయకులు చేసిన ప్రకటనలకు.. క్షేత్రస్థాయిలో చేపట్టిన పనులకు అసలు పొంతనే లేదు. పాతపట్నం పంచాయతీ అంతరాబ కూడలి నుంచి సీపీ రోడ్డును చంగుడి గ్రామం వరకు, చంగుడి నుంచి సరాలి మీదుగా మాకనాపల్లి కూడలి వరకు రూ.3.05 కోట్ల ఉపాధి నిధులతో ఈ ఏడాది ఏప్రిల్ 15న పనులు ప్రారంభించారు. తెంబూరు బీటీ రహదారి నుంచి సింగుపురం, రట్టిపేట, గురండి వరకు రూ.1.60 కోట్లతో కొంతమేర పనులు చేపట్టారు. ఈ రెండు రహదారులను మధ్యలోనే విడిచిపెట్టారు. పనులు చేపట్టే క్రమంలో రహదారులను తవ్వేసి మెటల్ వేసి వదిలేశారు. దీంతో మరింత అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారుల్లో నీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పనులు ప్రారంభించి ఐదు నెలలు దాటినా ఇంతవరకు పూర్తికాలేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఐదు నెలల నుంచి సరాలి, చంగుడి, అంతరాబ, సింగుపురం, రట్టిపేట, గురండి, బగదల గ్రామ ప్రజలు రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నారు. సుమారు పది గ్రామాల ప్రజలు రాకపోకలు చేస్తారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రెండు రహదారుల పనులు పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా విడిచిపెట్టిన సింగుపురం రోడ్డు దుస్థితి



సరాలి రోడ్డుకు ఐదు నెలల క్రితం వేసిన శిలాఫలకం

కష్టాలు తప్పడం లేదు



ఐదు నెలల క్రితం సరాలి రోడ్డు పనులు ప్రారంభించినా నేటికీ పూర్తికాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రాళ్లుతేలి గుంతలు ఏర్పడ్డాయి. రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలి.

– రాము జెన్నా, చంగుడి గ్రామం, పాతపట్నం మండలం

వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

సరాలి, సింగుపురం రహదారి పనులు వారం రోజుల్లో ప్రారంభిస్తాం. పనులు త్వరితగతిన పూర్తిచేయడానికి ప్రయత్నిస్తున్నాం. సరాలి రోడ్డుకు కొంత భాగం మెటల్ వేసి ఉంచాం. సింగుపురం రోడ్డు కూడా 50 శాతం పనులు పూర్తిచేశాం.

– ఆర్.చంద్రుడు నాయుడు, డీఈఈ, పీఆర్, పాతపట్నం

108 రావడం లేదు..



తమ గ్రామంలో ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే భయం వేస్తోంది. ఇటీవల రట్టిణి గ్రామానికి చెందిన గర్భిణికి నొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం ఇచ్చినా గ్రామానికి రాలేని పరిస్థితి. దీంతో తంప వరకు ఆటోలో తీసుకువెళ్లి 108లో పాతపట్నం సీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. ఆటోలో వెళ్లడం కూడా కష్టంగా ఉంటుంది. పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు.

– కొప్పురొతు వెంకటరావు, గురండి గ్రామం, పాతపట్నం మండలం

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



మందుల షాపును పరిశీలిస్తున్న వైద్యాధికారి ప్రసన్నకుమార్



ప్రైవేట్ క్లినిక్‌లో మంచాలు వేయడం సరికాదని పీఎంపీకి సూచిస్తున్న ప్రసన్నకుమార్

కొత్తూరు: మండల కేంద్రంలోని పలు మందుల షాపుల్లో పీఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లు, ల్యాబ్‌లను మండలంలోని కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ప్రసన్నకుమార్ గురువారం తనిఖీ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు. స్థాయికి మించి మందులను వినియోగంచడం, అనుమతులు లేని పలు రకాల మందులను విక్రయించడం, క్లినిక్‌లలో బెడ్‌లు వేయడం, ల్యాబ్‌లలో సరైన వైద్య పరికాలు లేకపోవడం, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం వంటివి గుర్తించినట్లు ప్రసన్నకుమార్ తెలిపారు. మందుల షాపుల్లో రోగులకు వైద్యం అందిచడం నిబంధనలకు విరుద్ధమన్నారు. 15 రోజుల్లో తప్పులను సరిచేసుకోకపోతే జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈఓ బుజ్జిబాబు ఉన్నారు.

యూరియా పంపిణీపై వాగ్వాదం



సుబుజ్జిలిలోని దుకాణం వద్ద ఎరువుల కోసం గుమిగూడిన రైతులు

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి జంక్షన్లో ఉన్న ఓ ప్రైవేట్ దుకాణంలో గురువారం పంపిణీ చేసిన ఎరువుల విషయంలో తేడాలు రావడంతో చిగురువలస, మత్రిపాడు గ్రామాల రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేటాయించిన ఎరువుల మొత్తం చిగురువలస రైతులుకే అందిస్తున్నారని, ఆ రెవెన్యూ పరిధిలో ఉన్న శ్రీరాంవలసలో తమకు భూములు ఉన్నాయని మత్రిపాడు గ్రామస్తులు అన్నారు. ఎరువులన్నీ చిరుగువలస రైతులకే పంపిణీ చేస్తే.. తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మరో ప్రైవేట్ షాపులో విజయరాంపురం, సింధువాడ రైతులుకు ఎక్కువ ఎరువులు కేటాయించి, సరుబుజ్జిలి రైతులుకు తక్కువ బస్తాలు కేటాయించడం పట్ల పలువురు రైతులు ఆగ్రహించారు.

బాధ్యతల స్వీకరణ

నరసన్నపేట: మండల ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా కె.ప్రవీణను డీపీఓ నియమించారు. ఆమె గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈఓపీఆర్డీగా పనిచేసిన రేణుకకు ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి రావడంతో ఆమె టెక్కలి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నరసన్నపేట మండలంలోని పెద్ద బొరిగివలస పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ప్రవీణకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పొందూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కంప్యూటర్ సైన్స్ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి.హెచ్.మధుసూదనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో యూజీసీ నెట్, ఏపీసెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 22వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులను అందజేయాలన్నారు. 25వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ 81067 85918, 99635 59593 నంబర్లను సంప్రదించాలన్నారు.

డెంగీతో వ్యక్తి మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

కొత్తూరు: మండలంలలోని గులివిందలపేటకు చెందిన మురపాక శ్రీనివాసరావు (40) డెంగీ వ్యాధి లక్షణాలతో మృతి చెందారు. తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ స్థానికంగా వైద్యం తీసుకున్నారు. జ్వరం తగ్గకపోవడంతో శ్రీకాకుళంలోని రిమ్స్‌లో చేరారు. రిమ్స్‌లో వైద్యం పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతునికి భార్య హారతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు శ్రీనివాస్ తాపీ పని చేస్తున్నారు.

యూరియా అందించాలని ఆందోళన..!



తహసీల్దార్ వద్ద యూరియా అందించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్న శేఖరాపురం రైతులు

- ఆర్డీఓ ఆదేశించినా అధికారుల్లో చలనం లేదు
- ఒడిశాను నుంచి అధిక ధరలకు యూరియా కొనుగోలు చేస్తున్నాం
- తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన శేఖరాపురం రైతులు

మెళియాపుట్టి: యూరియా సకాలంలో అందక అవస్థలు పడుతున్నామని, తమకు ఎరువులు అందించాలని మండలంలోని శేఖరాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ పాపారావుకు వినతిపత్రం అందించారు. యూరియా లేక ఒడిశాకు వెళ్లి అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి మెళియాపుట్టిలో ఎరువుల దుకాణాలను పరిశీలించిన సమయంలో యూరియా అందలేదని తమ గ్రామానికి చెందిన ఎన్ని జగన్నాథం ఫిర్యాదు చేశారన్నారు. రైతుతో ఆర్డీఓ మాట్లాడుతూ.. నువ్వు పొలం చేస్తున్నావా? అయితే చూపించు అని ప్రశ్నల మీద ప్రశ్నలు వేశారన్నారు. శేఖరాపురం గ్రామానికి తీసుకెళ్లి జగన్నాథం తన పొలాన్ని చూపించారన్నారు. అక్కడి నుంచే మండల స్థాయి వ్యవసాయశాఖ అధికారులతో ఆర్డీఓ మాట్లాడి వెంటనే శేఖరాపురం గ్రామానికి యూరియా అందించాలని ఆదేశించారన్నారు. 5 మెట్రిక్ టన్నుల ఎరువులు వస్తాయని, వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని మండల వ్యవసాయశాఖ సిబ్బంది ఆర్డీఓతో చెప్పారన్నారు. అయినా నేటికీ ఎరువుల పంపిణీ జరగలేదన్నారు. రూ.268 లకే యూరియా అందించాల్సిన ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఒడిశాలో రూ.850 వెచ్చించి యూరియా బస్తా కొనుక్కుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారుగా 40 మంది రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేయడంతో రెండెకరాలకు ఒక బస్తా ఇస్తామని హామీ ఇచ్చారు. రైతుల పేర్లు నమోదు చేసుకుని పంపించేశారు. వినతిపత్రం అందించిన వారిలో గోక మోహన్‌రావు, ఎన్ని జగన్నాథం, నక్క చందరరావు, నక్క ధర్మారావు, నక్క గణపతిరావు, శాసనాం కాంతమ్మ, నక్క లక్ష్మీనారాయణ, ఎన్ని పాపయ్య, బొంగర్ల మోహనరావు, తదితరులు ఉన్నారు.

నేను రైతునంటే నమ్మలేదు..



టెక్కలి ఆర్డీఓకి ఎరువులు అందలేదు అని అడిగినందుకు నా పొలం చూపిస్తేనే రైతువని నమ్ముతానని అన్నారు. నా పొలం వద్దే ఎరువులు పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశించారు. యూరియా అందుతాయని ఆనందించాను. ఇంతవరకు ఎరువులు ఇవ్వలేదు. అందుకే తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి మా బాధలు తెలియజేశాం.

– ఎన్ని జగన్నాథం, రైతు, శేఖరాపురం

వైఎస్ జగన్‌ను కలిసిన రెడ్డి శాంతి



వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో గల పార్టీ కేంద్రం కార్యాలయంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పాతపట్నం నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితిని వివరించినట్లు ఆమె తెలిపారు. అధికార కూటమిపై పార్టీ పరంగా ఆందోళనలు చేపడుతున్నామని.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తున్నామని వివరించానన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి వస్తోందన్నారు.

– హిరమండలం

రోడ్డు ఇలా.. నడిచేదెలా?



పాతపట్నం మండల కేంద్రంలోని ఎర్ర చెరువు దిగువ ఉన్న యశోదనగర్ రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండడంతో అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షం కురిస్తే నీరుచేరుతోంది. మురుగునీటిలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మరోపక్క నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెందడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– పాతపట్నం

పరామర్శ..



సత్యవతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్, నాయకులు

నరసన్నపేట: మండలంలోని చిక్కాలవలసకు చెందిన మంజూరి సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ గురువారం పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఇదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పండూరి సింహాచలంను పరామర్శించి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ ప్రతినిధి చింతు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొబ్బాది ఈశ్వరరావు, మొయ్యి లక్ష్మునాయుడు, తోట భార్గవ్, దంత చరణ్, తదితరులు ఉన్నారు.

థర్మల్ నిర్ణయం ఆపకపోతే ప్రతిఘటిస్తాం



నిరసన తెలియజేస్తున్న పోరాట కమిటీ సభ్యులు

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో థర్మల్ పవర్ ప్లాంట్ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించకపోతే ప్రతిఘటన తప్పదని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు సురేష్‌దొర హెచ్చరించారు. మండల కేంద్రంలో పవర్ ప్లాంట్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ నెల 22న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. పోరాట కమిటీ కోశాధికారి అత్తులూరి రవికాంత్ మాట్లాడుతూ పవర్ ప్లాంట్ వలన ఈ రెండు మండలాల రైతులు, నష్టపోతారన్నారు. పర్యావరణం పూర్తిగా పాడవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ కార్యదర్శి సింహాచలం, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం



గోవిందరావు

ఆమదాలవలస: చంద్రబాబు పాలనలో పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఒక్క పేద విద్యార్థికి వైద్య విద్యను చేరువ చేయాలనే సంకల్పంతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తే, వాటిని ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సుదీర్ఘ అనుభవం ఉందని ప్రగల్భాలు పలుకుతున్న చంద్రబాబు నాయుడు ఒక్క మెడికల్ కళాశాలనైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెడితే ఊరుకునేది లేదన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

హిరమండలం: కార్మెల్ స్కూల్‌లో పాఠశాల జోనల్ స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల నుంచి వందలాది మంది క్రీడాకారులు హాజరయ్యారు. 30 మంది పీఈటీలు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. గురువారం బాలికల విభాగానికి పోటీలు ఏర్పాటు చేశారు. శుక్రవారం బాలురుకు సంబంధించి క్రీడా పోటీలు ఉంటాయన్నారు. పోటీలను ఎంఈఓ రాంబాబు పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 20 మంది పేద విద్యార్థులకు యూనిఫాంను ఆమదాలవలస రోటరీ క్లబ్ సభ్యులు గురువారం అందజేశారు. రోటరీ క్లబ్ సేవాభావంతో ఈ దుస్తులను అందజేసినట్లు రొటేరియన్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌సుందర్, అధ్యపకులు, రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వి.టి.చౌదరి, జె.కె.వెంకటేశ్వరరావు, రొటేరియన్‌లు జె.రవిబాబు, కె.సంజీవరావు, ఎస్.రవికుమార్, బి.ఎ.స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణతో ఉత్తమ ఫలితాలు

జలుమూరు: ప్రత్యేక శిక్షణతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఎంఈఓ బి.మాధవరావు అన్నారు. గురువారం జలుమూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. నవోదయ పోటీ పరీక్షలపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు మెండ రామారావును అభినందించారు. రామారావును ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.